



## భార్య పుట్టింటి నుంచి రావడం లేదని..

- కిష్టంపేటలో యువకుడి ఆత్మహత్య
- ఇందిరమ్మ ఇల్లు రాలేదని పాణం తీసుకున్నడు: భార్య

కాల్వశ్రీరాంపూర్, జనవరి 27: భార్య పుట్టింటి నుంచి తిరిగి రావడం లేదని మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దపల్లి జిల్లా కిష్టంపేటలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల కిష్టంపేట గ్రామానికి చెందిన పురుషోత్తం ప్రభాకర్ (45), రమ భార్యభర్తలు. అయితే గ్రామంలోని పొలం పనులకు రావాలని రమకు చెప్పగా, ఆమె వెళ్లలేదు. ఈ విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో రమ తన తల్లిగారింటికి వెళ్లి పోయింది. కిష్టంపేటకు తిరిగి రావాలని ప్రభాకర్ కోరినా ఆమె రాకపోవడంతో మనస్తాపం చెందాడు. ఆదివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కాల్వశ్రీరాంపూర్ దవాఖానకు తరలించగా, వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రభాకర్ తల్లి మధునమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**ఇందిరమ్మ ఇల్లు రాలేదనే ఆత్మహత్య చేసుకున్నడు: భార్య రమ**

'తమకు పిల్లలు లేరు. పూరి గుడిసెలో ఉంటున్నాం. కొంత అప్పు ఉంది. ఆరోగ్యం బాగా లేక మా తల్లిగారింటికి వెళ్లిన. అయితే మేం ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నం. అయినా ఫైనల్ లిస్టలో మాపేరు లేదు. మనస్తాపం చెంది నా భర్త ఉరివేసుకొని చనిపోయాడని' భార్య రమ కన్నీటి పర్యంతమైంది. పెద్దపల్లి దవాఖాన వద్ద రోదించింది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరింది.

## స్నేహితుని మృతుడిని తట్టుకోలేక విద్యార్థి..

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 27: స్నేహితుడి మృతుని జీర్ణించుకోలేక గోదావరిఖని మేదరిబస్తీకి చెందిన ఇంటర్ విద్యార్థి సులువ శ్రీనాదీశ్వర్(18) ఆదివారం అర్ధరాత్రి ఇంటి వంటగదిలో ఇనుప పైపునకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలాన్నాయి. నెల క్రితం శ్రీనాదీశ్వర్ స్నేహితుడు ముక్క రోహక్ మృతి చెందాడు. అప్పటి నుంచి స్నేహితుడి మృతితో దిగులుతో బాధపడుడుతున్నాడు. ఆదివారం స్నేహితుడి నెల మాసికానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన శ్రీనాదీశ్వర్ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది.

## వృద్ధురాలిపై దాడి

ముత్తారం, జనవరి 27: ఖమ్మంపల్లికి చెందిన మంథని రాజక్క అనే వృద్ధురాలిపై అదే గ్రామానికి చెందిన మంథని వంశీ దాడి చేశాడని ఎస్ఐ గోపతి నరేశ్ తెలిపారు. రాజక్క తన కూతురు సమ్మక్కతో కలిసి గ్రామంలో ఉంటున్నది. ఈ నెల 26న రాత్రి వారి బంధువు మంథని వంశీ మద్యంతో ఇంటికి వెళ్లాడు. వంశీ, సమ్మక్క ఇద్దరూ కలిసి మద్యం తాగారని తెలిపారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య మాటా మాట పెరిగి వంశీ అక్కడే ఉన్న కర్రతో సమ్మక్కను కొట్టాడు. అడ్డుకునేందుకు వచ్చిన రాజక్కను నెట్టి వేయడంతో ఆమెకు గాయాలయ్యాయి. సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## బీమా చెక్కు అందజేత

ముత్తారం, జనవరి 27: ఓడేడు గ్రామానికి చెందిన పొలం రాజయ్య కొద్ది నెలల క్రితం మృతి చెందాడు. అతని భార్య సమ్మక్కకు రూ. రెండు లక్షల విలువైన పీఎం జేజేబీవై ప్రమాద బీమా చెక్కును పెద్దపల్లి పోస్ట్ ఆఫీస్ ఐపీపీబీ చీఫ్ మేనేజర్ కే శ్రీనివాస్, బీపీఎం స్వప్న సోమవారం అందించారు. రాజయ్య రూ. 349లతో ప్రమాద బీమా చేయించుకున్నాడని పేర్కొన్నారు. బీమా చేయించుకున్న 60 రోజులకే రాజయ్య చనిపోగా, అతని భార్యకు రూ. 2 లక్షల ప్రమాద బీమా చెక్కు అందించినట్లు తెలిపారు. ఇక్కడ కారోబార్ అక్కపాక ప్రభాకర్, పొలం చిరంజీవి పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయం మార్పు

పెద్దపల్లి రూరల్, జనవరి 27: పెద్దపల్లి మండలపరిషత్ కార్యాలయాన్ని రైల్వేస్టేషన్ రోడ్డులోని ట్రినిటి పాఠశాల, జూనియర్ కళాశాల సమీపంలోని భవనంలోకి మార్చినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ భవన సముదాయం పరిసరాలను ఆర్టీసీ బస్ డిపోకు కేటాయించడంతో కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు పాత భవనంలోని కార్యాలయాన్ని మరో భవనంలోకి మార్చినట్లు వివరించారు. ఈ విషయాన్ని మండల ప్రజలు అధికారులు, నాయకులు గమనించాలని కోరారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్‌పై దాడి..!?

- తప్పుడు డాక్యుమెంట్‌తో ఒకరి భూమి మరొకరికి రిజిస్ట్రేషన్
- పెద్దపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

పెద్దపల్లి, జనవరి 27(నమస్తే తెలంగాణ): పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్‌పై రియల్టర్ దాడికి పాల్పడ్డ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 24(శనివారం)న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తలుపులు పెట్టి తనపై రియల్టర్ దాడికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ డాక్యుమెంట్ రైటర్ దస్తగిరి పాషా మీడియా ముందుకు రావడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తనపై దాడికి పాల్పడ్డ వారిని సబ్ రిజిస్ట్రార్ అశోక్ కాపాడుతున్నాడంటూ ఆరోపణలు గుప్పించడం పలు అనుమానాలకు తావిస్తున్నది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తప్పుడు డాక్యుమెంట్‌తో ఒకరి భూమి మరొకరికి రిజిస్ట్రేషన్ చేశారని, దీనికి డాక్యుమెంట్ రైటర్ కారణమని ఆరోపిస్తూ దాడికి దిగినట్లు తెలుస్తోంది. అయితే, అక్రమాలు తాను చేయలేదని, సబ్ రిజిస్ట్రార్‌తో సిబ్బంది చేయడం వల్లే ఆ రిజిస్ట్రేషన్ జరిగిందని బాధితుడు ఆరోపిస్తున్నాడు.



పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

డాక్యుమెంట్ రైటర్ దస్తగిరి పాషా కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. జూలై నెలలో రాఘవాపూర్ శివారులో గల 1-07 ఎకరాలను పూదరి శ్రీనివాస్, కోట కుమార్ భాగస్వాములుగా కొనుగోలు చేయగా డాక్యుమెంట్ రైటర్ దస్తగిరి ద్వారా రిజిస్ట్రేషన్ జరిగింది. రిజిస్ట్రేషన్ తర్వాత పూదరి శ్రీనివాస్, కోట కుమార్ మధ్య గొడవలు వచ్చాయి. దీంతో కుమార్ ఆ భూమిని సొంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు, సిబ్బందితో మాట్లాడుకొని గతంలో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు తయారు చేసిన దస్తగిరి పాషాను సంప్రదించాడు. రిజిస్ట్రేషన్ కోసం కుమార్ అక్టోబర్ నెలలో దరఖాస్తు చేయగా, రిజిస్ట్రార్ ఆ ఫైలును పెండింగ్‌లో ఉంచారు. జనవరిలో సబ్ రిజిస్ట్రార్‌తోపాటు ఆఫీసు సిబ్బంది సహకారంతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న మరో భాగస్వామి శ్రీనివాస్ తనకు తెల్వకుండా రిజిస్ట్రేషన్ ఎందుకు చేశారంటూ రిజిస్ట్రార్‌తో గొడవకు దిగి అక్కడే ఉన్న డాక్యుమెంట్ రైటర్‌పై దాడికి పాల్పడడం గొడవకు దారి తీసింది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోనే దాడి జరగగా.. ఈ విషయంలో సబ్ రిజిస్ట్రార్ మాత్రం పోలీసులకు ఫిర్యాదు చేయకుండా మిన్నకుండి పోయారు. దీంతో అసలు అవినీతికి పాల్పడ్డది రిజిస్ట్రార్ అశోక్, సిబ్బంది అనితే తనను బాధ్యుడిని చేసి దాడి చేశారని డాక్యుమెంట్ రైటర్ ఆరోపిస్తున్నాడు. దాడికి పాల్పడ్డ శ్రీనివాస్‌పై ఎలాంటి ఫిర్యాదు చేయకపోవడంపై సబ్ రిజిస్ట్రార్‌ను స్థానికులు నిలదీశారు. అయితే, తనపై శ్రీనివాస్ అకారణంగా దాడి చేశారని, తనకు సమాచారం లేకుండా డాక్యుమెంట్ సిబ్బందితో కలసి ఫోర్జరీ చేసి తప్పుడు రిజిస్ట్రేషన్ చేశాడని రైటర్ దస్తగిరి తెలిపారు.

### తలుపులు పెట్టి నాపై దాడి చేశారు



నాలాను దిద్ది తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి ఉమ్మడిగా ఉన్న 1-07ఎకరాల భూమిని కోట కుమార్‌పై రిజిస్ట్రేషన్ చేసింది సబ్ రిజిస్ట్రార్, కార్యాలయ సిబ్బంది. కానీ, నన్ను బాధ్యుడిని చేస్తూ నాపై దాడికి దిగారు. సబ్ రిజిస్ట్రార్ కళ్ల ఎదుటనే తలుపులు పెట్టి నాపై దాడి చేశారు. కార్యాలయంలో సీసీ పుటేజీలు ఉన్నాయి. ఆ దస్తావేజులకు నాకు ఎలాంటి సంబంధం లేదు. కోట కుమార్ అనే వ్యక్తి సార్‌తో నేను మాట్లాడుకుంట అంటే నేను డాక్యుమెంట్ రాసిన.

**-దస్తగిరి పాషా, డాక్యుమెంట్ రైటర్ పెద్దపల్లి**

### ఎలాంటి పొరపాటు లేదు



భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన విషయంలో ఎలాంటి పొరపాటు జరగలేదు. దస్తగిరి పాషాకు మరో వ్యక్తికి మధ్య వ్యక్తిగత కారణాల వల్లే గొడవ జరిగింది. వాళ్లు బయట మట్లాడుకొని వచ్చి లోపల గొడవ పడ్డారు. ఎలాంటి దాడి జరగలేదు. ఘర్షణ చోటు చేసుకుంది. ఎవరూ చేయి చేసుకోలేదు. నిన్న, మొన్న డాక్యుమెంట్ రైటర్ ఏం చెప్పలేదు. ఈరోజు మాత్రం ఇలా మాట్లాడుతున్నాడు. ఎలాంటి దాడి జరగలేదు. ఉన్నతాధికారులతో చర్చించి అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.

**- అశోక్, సబ్ రిజిస్ట్రార్ పెద్దపల్లి**

## రామగుండంలో పర్యావరణం కలుషితం

గోదావరిఖని, జనవరి 27: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఎన్టీపీసీ, ఆర్ఎఫ్సీఎల్, బొగ్గు గనుల నుంచి విడుదలవుతున్న వ్యర్థాలతో పర్యావరణం కలుషితమవుతున్నదని పర్యావరణ కార్యకర్తలు దహగామ ఉమామహేశ్వర్, రంజిత్‌కుమార్(న్యాయవాది) తెలిపారు. గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు మాట్లాడారు. విష ఉద్గార సాంద్రత తీవ్రస్థాయిలో పెరిగిందన్నారు.ఈక్రమంలో తెలంగాణ ఫేజ్ 2 కింద 2400మెగావాట్ల ప్లాంటు నిర్మాణంతో మైక్రో గ్రాముల ఏక్యూఐ మరింత పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ 2400మెగావాట్ల ప్లాంటుకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం ఇక్కడ జీవించే హక్కుకే వ్యతిరేకమన్నారు. ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

## నిరుపేద యువతి వివాహానికి సాయం

కోల్‌సిటీ, జనవరి 27: శివాజీ నగర్‌కు చెందిన నిరుపేద యువతి మహ్మద్ రిజ్వానాకు ముస్లిం వెల్ఫేర్ ఆర్గనైజేషన్ తరపున సోమవారం రూ.10వేలు అందజేశారు. ఆర్గనైజేషన్ అధ్యక్షుడు షేక్ హాజ్ అలీ, మీర్ జాకీర్ అలీ, బాజీ, సయ్యద్ జానీ, ఖాసీం, రియాజ్ బేగ్, మున్వర్, హుస్సేన్, ముబీన్, మీర్ ఫయాజ్, సయ్యద్ మొయిన్, జహీర్, నయీం పాల్గొన్నారు.

## ఓపీఎస్ అమలు చేయాలి

కమాన్‌పూర్, జనవరి 27 : రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ (పాత పెన్షన్) విధానాన్ని అమలు చేయాలని కోరుతూ పీఆర్టీయూ - టీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ వాసంతికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఇక్కడ మండల అధ్యక్షుడు గసిగంటి రమేశ్, మేరుగు రాజమౌళి, సూదిరెడ్డి శ్రీనివాస్, సతీశ్, మంద సతీశ్ పాల్గొన్నారు.

## పాత పింఛన్ విధానం అమలు చేయాలి

ముత్తారం జనవరి 27: పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ తహసీల్దార్ సుమన్‌కు ఉపాధ్యాయులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఇక్కడ పీఆర్టీయూ మండల అధ్యక్షుడు మారెల్లి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు పిల్లలమర్రి సత్తయ్య, సలాకుల శ్రీధర్, తిరుపతి, సతీశ్ పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న స్నేహితులు

పాలకుర్తి, జనవరి27: పాలకుర్తి మండలం గన్‌శ్యాందాస్‌నగర్‌కు చెందిన పల్లపు కుమార్ ఇటీవల మృతి చెందగా, ఆ కుటుంబానికి తోటి స్నేహితులు ఆర్థిక సాయం అందించారు. మూడునెలల సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశారు. కుమార్‌కు భార్య, ముగ్గురు చిన్నపిల్లలు ఉన్నారు. వారి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న బసంత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన స్నేహితులు, కుమార్ చిన్న కూతురు పేరి పోస్టాఫీస్‌లో రూ.50వేలు డిపాజిట్ చేశారు. స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకున్న మిత్రులను గ్రామస్తులు అభినందించారు.



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న మాజీ కార్పొరేటర్ బొడ్డు రజిత-రవీందర్

## పారిశుధ్య కార్మికులకు సన్మానం

కోల్‌సిటీ, జనవరి 27: నగరంలోని 12 డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ బొడ్డు రజిత రవీందర్ దంపతులు పారిశుధ్య కార్మికులను సోమవారం సన్మానించారు. తమ ఐదేళ్ల పదవీ కాలం ముగిసిన సందర్భంగా ఆ డివిజన్‌కు చెందిన సుమారు 18 మంది పారిశుధ్య కార్మికులు, సూపర్‌వైజర్లను సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సందవేన కుమార్, వెంకటేశ్, విజయ్, రాజు, ఎర్రోళ్ల రాజు, కుందం శ్రీకాంత్, వెంకట్, వంశీ, పవన్, మద్దెల సురేశ్, సూపర్‌వైజర్లు సారయ్య, ఆడెపు శ్రీనివాస్, అసిస్టెంట్ సూపర్‌వైజర్లు నవీన్, మూర్తి, కార్మికులు పాల్గొన్నారు.

## శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ అభ్యర్థులతో అధికారులు

యైటింక్లయిన్ కాలనీ, జనవరి 27: సింగరేణి ఆర్జీ-2 ఏరియాలో నూతనంగా నియమించిన ఎక్స్‌టర్నల్ మేనేజ్‌మెంట్ ట్రైనీ ఈ అండ్ ఎం, సిస్టమ్, ఐటీ ప్రోగ్రామర్, ఐఈ విభాగాలకు చెందిన అభ్యర్థులకు శిక్షణ తరగతులను ఆర్జీ-2 జీఎం వెంకటయ్య సోమవారం ప్రారంభించారు. ఈ అండ్ ం ట్రైనీలు 23, ఏడుగురు ఐటీ ప్రోగ్రామర్, ఆరుగురు ఐఈ అభ్యర్థులు హాజరయ్యారు. వీరికి రెండు వారాల పాటు సింగరేణిలోని వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేట్ ఏజీఎం వెంకయ్య, డీజీఎం హుస్సేన్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 29న విద్యుత్ కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష

పెద్దపల్లి, జనవరి27: రానున్న వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై (విద్యుత్ కార్యాచరణ ప్రణాళిక) ఈ నెల 29న పెద్దపల్లి ఎస్ఈ కార్యాలయంలో సమీక్ష నిర్వహించనున్నట్లు పెద్దపల్లి సర్కిల్ ఎస్ఈ కే మాధవ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సీఈ (ఎంఆర్‌టీ), పెద్దపల్లి సర్కిల్ నోడల్ అధికారి బీ అశోక్‌కుమార్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి సర్కిల్ పరిధిలోని డీఈలు, ఏడీఈలు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

## కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వండి..

కమాన్‌పూర్, జనవరి 27 : ప్రభుత్వం పంపిణీ చేసిన భూములకు సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వన్‌బీ, పహాణీలు వచ్చేలా, అలాగే కొత్త పట్టా పాస్‌పుస్తకాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరూతూ జూలపల్లికి చెందిన పలువురు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. గ్రామ శివారులో సర్వే నంబర్ 50, 50/1లలో దళిత సామాజిక వర్గానికి చెందిన తమకు ప్రభుత్వం వ్యవసాయ భూమి పంపిణీ చేసిందని తెలిపారు. ఈ వ్యవసాయ భూమిని ఆన్లైన్‌లో నమోదు చేసి వన్ బీ, పహాణీ, పాస్ బుక్ ఇప్పించాలని కోరారు.

## మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

మంథని, జనవరి27: మహిళలు స్వశక్తితో ఉపాధి అవకాశాలు అందుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఉషా ఇంటర్నేషనల్ కంపెనీ సౌత్ ఇండియా డిప్యూటీ మేనేజర్ టీ రాజ్ కుమార్ ఆకాంక్షించారు. పట్టణంలోని సీయోను ప్రార్థన మందిరంలో ఉషా ఇంటర్నేషనల్ కంపెనీ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణను యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్‌తో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అంకరి కుమార్ అధ్యక్షత వహించగా డాక్టర్ వల్లూరి ప్రభాకర్, మేకల మల్లేశం, ఎంకే జోసఫ్, మంథని ప్రసాద్, అందే రమేశ్, అజ్మీరా దయారాజ్, దూడ మహేశ్, గద్దల రాజేశ్ పాల్గొన్నారు.